సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం ׀ 29 ׀ ఏప్రిల్ ׀ 2024



ఆర్టీసీలో 'మహాలక్ష్మి' కళ!
ఆర్టీసీలో మహాలక్ష్మి పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. గతంలో 69 శాతంగా ఉన్న ఓఆర్ 100 శాతానికి పెరిగింది. 8లో



కేసీఆర్ రోడ్ షో..
ఈ నెల 30న జిల్లాలో నిర్వహించే కేసీఆర్ రోడ్ షోను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 26°

వాతావరణం
జిల్లాలో సోమవారం ఉదయం నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడగాలులు వీస్తాయి.

మేం ఎదగాలా.. వద్దా ?!

పబ్లిక్ డిమాండ్

'ఖమ్మంలో జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు దశాబ్దాల కల. యూనివర్సిటీ లేకపోవడంతో ఇక్కడి యువత హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లి చదువుకోవడం భారంగా మారుతోంది. ఇది భరించలేక కొందరు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటు చేస్తే పరిసర ప్రాంతాల యువతకు ఉపయోగపడుతుంది' అని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం విద్యార్థి సంఘాలు కొన్నేళ్లుగా పోరాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇస్తూనే ఉన్నాయి. ఈ నేపథ్యాన ఖమ్మంలో యూనివర్సిటీ ఆవశ్యకత, ఆటంకాలు తదితర అంశాలపై 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన డిబేట్‌లో వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు మాట్లాడారు. – ఖమ్మంమయూరిసెంటర్



ఉన్నత విద్యకు దూరంగా యువతరం

- కలగానే ఖమ్మం విశ్వవిద్యాలయం
- ఏళ్లుగా జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు డిమాండ్
- లోక్‌సభ ఎన్నికల హామీల్లో చేర్చాలని వినతులు



'సాక్షి' డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థి సంఘాల నాయకులు

అన్నీ అనుకూలాంశాలే...

ఉమ్మడి ఖమ్మం జిల్లా కేంద్రంగా ఉన్న ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేశంలోనే తొలిసారిగా న్యాక్ ఏ ప్లస్ ప్లస్ (++) గ్రేడ్ సాధించిందని డిబేట్‌లో పాల్గొన్న వక్తలు వెల్లడించారు. ఈ కళాశాల ఆవరణలో యూనివర్సిటీ ఏర్పాటుకు సరిపడా స్థలం, భవనాలు ఉన్నాయని అన్నారు. ఈ కళాశాల వేదికగా ప్రభుత్వ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తే ఉమ్మడి ఖమ్మం కేంద్రంగా అందరికీ ఉన్నత విద్య అందుతుందని.. యూజీసీ నిబంధనల ప్రకారం యూనివర్సిటీ ఏర్పాటుకు ఖమ్మంలో అనుకూల పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 146 డిగ్రీ కళాశాలలు, 26 పీజీ కళాశాలలు, 10 బీఈడీ, నాలుగు డైట్, ఒక లా కళాశాలలు ఉండగా.. సుమారు 90 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ఇక్కడ ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటైతే దూరాభారం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.

నిరుద్యోగులకు అవకాశాలు

యూనివర్సిటీ లేక విద్యార్థులు డిగ్రీ తర్వాత ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వక్తలు తెలిపారు. కొందరు వెళ్తున్నా.. ఇంకొందరు వెళ్లలేక డిగ్రీతో చదువు ఆపేస్తున్నారని పేర్కొన్నారు. ఫలితంగా వారికి ఉపాధి లభించడం లేదని తెలిపారు. ఖమ్మం కేంద్రంగా యూనివర్సిటీ ఏర్పాటుచేస్తే విద్యార్థులకు ఉన్నత విద్య అందుబాటులోకి రావడమే కాక యూనివర్సిటీలో అధ్యాపకుల పోస్టులు, నాన్ టీచింగ్, ఇతర విభాగాల్లో అనేక ఉద్యోగాలు లభించే అవకాశముందని చెప్పారు. ఈ మేరకు లోక్‌సభ ఎన్నికల్లోనైనా రాజకీయ పార్టీలు యూనివర్సిటీ ఏర్పాటును తమ మేనిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ డిబేట్‌లో ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌ఎఫ్, ఎన్‌ఎస్‌యూఐ, పీవైఎల్ సంఘాల నాయకులు టి.ప్రవీణ్‌కుమార్, వి.వెంకటేష్, ఎం.లక్ష్మణ్, జి.మస్తాన్, ఆసిఫ్, కె.లక్ష్మీనారాయణ, మంద సురేష్, ఎం.కరుణ్, లాల్‌పాషా, సందీప్, డి.శ్రీను, వినోద్, మనోజ్, శివ, ఎం.సాయి, ఎన్.సాయి, క్రాంతి, రామకృష్ణ, వర్దన్, రాజేష్, కార్తీక్ పాల్గొన్నారు.

ఉన్నత విద్యకు దూరమవుతున్నారు..



ఇక్కడ యూనివర్సిటీ లేక విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారు. గత ప్రభుత్వాలు హామీ ఇచ్చినా విస్మరించాయి. ఇకనైనా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి.
– టి.ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

దశాబ్దాలుగా ఉద్యమం..



ఖమ్మం విద్యా హబ్‌గా ఉంది. దశాబ్దాలుగా యూనివర్సిటీ కోసం ఉద్యమాలు జరుగుతున్నాయి. ఈసారి 'ఓటు కావాలంటే.. మాకు యూనివర్సిటీ ఇవ్వండి' అని పార్టీలను డిమాండ్ చేస్తాం.
– వి.వెంకటేష్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

జిల్లాకు అర్హత ఉంది..



ఖమ్మంలో ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటుకు అర్హతలు ఉన్నా పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇకనైనా పరిశీలించి యూనివర్సిటీ ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలి.
– ఎం.లక్ష్మణ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు

అన్ని చోట్లా ఉన్నా..



రాష్ట్రంలో అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో యూనివర్సిటీలు ఉన్నా ఖమ్మంలో లేదు. దీంతో ఇక్కడి యువత చదువు ఆపేయాల్సి వస్తోంది. కొత్త ప్రభుత్వమైనా ఈ విషయంలో చొరవ చూపాలి.
– జి.మస్తాన్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి

మంత్రులు సానుకూలంగా ఉన్నారు..



గత ప్రభుత్వం యూనివర్సిటీపై ఆలోచన చేయలేదు. ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు సానుకూలంగా ఉన్నందున యూనివర్సిటీ ఏర్పాటుపై ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.
– ఆసిఫ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలో మూలమూర్తులకు ఆదివారం అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. వేసవిసెలవులు, వారాంతపు సెలవు దినాలు కావడంతో భక్తులు స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. నిత్యకల్యాణం, ఇతర ఆర్జిత సేవల్లో సైతం పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి అర్చకులు విశేషపూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. భక్తులు అన్నప్రాసనలు, ఒడిబియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో ఈఓ జి.సుదర్శన్, అర్చకులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి



బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరాగా, సందడి నెలకొంది. కిన్నెరసాని జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 392 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా, వాహనాల ప్రవేశ రుసుం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.11,310 ఆదాయం లభించగా, 178 మంది బోటు షికారు చేయగా, టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.8,900 లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో జిల్లాకు ఏడు పతకాలు



అభినందిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కొత్తగూడెంటౌన్: రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భద్రాద్రి జిల్లాను ఏడు పతకాలు వరించాయి. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న సూర్యాపేటలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. ఆదివారం అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ వివరాలు వెల్లడించారు. పోటీల్లో భద్రాచలానికి చెందిన వర్సరాజు 400 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం, కొత్తగూడేనికి ఎం.ఇందు 2000 మీటర్ల పరుగు పందెంలో రజత, పాల్వంచకు చెందిన సీహెచ్ వినయ్ 800 మీటర్ల పరుగుపందెంలో రజత, కొత్తగూడేనికి చెందిన ఎం.సంగీత 400 మీటర్ల పరుగుపందెంలో కాంస్య, ఎం.అఖిల్ 2000 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం, పాల్వంచకు చెందిన డి.లోకేష్ 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, పి. మనోజ్ కుమార్ 100 మీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా విజేతలతోపాటు కోచ్‌లు పి. నాగేందర్, ఎం.నరేష్, శివను జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి పి. పరంధామరెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి, జీవీకే మనోహర్‌రావు, గొట్టపు రాధాకృష్ణ, రాజేంద్రప్రసాద్ అభినందించారు.

నేడు ఖమ్మంలో కేసీఆర్ బస్సు యాత్ర

- రాత్రికి నగరంలోనే బస
- రేపు ఖమ్మంలో ముఖ్య నేతలతో సమావేశం, కొత్తగూడెంలో రోడ్‌షో



ఖమ్మంమయూరిసెంటర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ఆ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన బస్సు యాత్ర సోమవారం ఖమ్మం చేరుకోనుంది. నేడు సాయంత్రం వరంగల్ నుంచి తిరుమలాయపాలెం మీదుగా ఖమ్మం చేరుకుని, కాల్వొడ్డు నుంచి మయూరిసెంటర్, వైరా రోడ్డు మీదుగా జెడ్పీ సెంటర్‌కు యాత్ర కొనసాగుతుంది. మాజీ సీఎం కేసీఆర్ జెడ్పీ సెంటర్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతారు.

బస్సుయాత్ర విజయవంతానికి ఏర్పాట్లు..
అసెంబ్లీ ఎన్నికల సమయంలో కేసీఆర్ ఖమ్మంలో జరిగిన సభలో చివరిసారిగా పాల్గొన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు తిరిగి బస్సుయాత్ర చేపట్టారు. సోమవారం ఖమ్మంలో కేసీఆర్ పాల్గొనే బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు జిల్లా బీఆర్‌ఎస్ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కేసీఆర్‌కు ఘన స్వాగతం పలకడంతో పాటు యాత్రకు అడుగడుగునా బ్రహ్మరథం పట్టేలా సన్నాహాలు చేస్తున్నారు.

ఖమ్మంలో ముఖ్య నేతలతో సమావేశం..
సాయంత్రం 5 గంటలకు కేసీఆర్ బస్సుయాత్ర ఖమ్మం చేరుకోనుంది. నగరంలో బస్సుయాత్ర, జెడ్పీ సెంటర్‌లో కార్నర్ మీటింగ్ ముగిసిన అనంతరం కేసీఆర్ ఖమ్మంలోని మాజీ మంత్రి పువ్వాడ నివాసంలో బస చేయనున్నారు. 30వ తేదీ ఉదయం బీఆర్‌ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం కోసం చేపట్టాల్సిన అంశాలపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం బస్సుయాత్ర ఖమ్మం నుంచి బయలుదేరి వైరా, తల్లాడ మీదుగా భద్రాద్రి జిల్లా జూలూరుపాడుకు చేరుకోనుంది. అక్కడ నుంచి కొత్తగూడెం చేరుకుని అక్కడ నిర్వహించే సభలో మాట్లాడుతారు. మంగళవారం రాత్రి కొత్తగూడెంలోనే బస చేసి, బుధవారం ఇల్లెందు మీదుగా మహబూబాబాద్‌కు వెళతారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న ప్రియాంక

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ నగదు, మద్యం రవాణాను అరికట్టేందుకు ఆదివారం కలెక్టరేట్‌లో ఫ్లయింగ్ స్క్వాడ్, నియోజకవర్గ, మండలస్థాయి ఎస్‌ఎస్‌టీ, ఎఫ్‌ఎస్‌టీ, పోలీస్ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీలో మోడల్ కోడ్ ఉల్లంఘించిన వారిపై తీసుకున్న చర్యల నివేదిక అందించాలన్నారు. డబ్బు, మద్యం పట్టుబడిన సందర్భంలో వీడియో రికార్డింగ్ తప్పనిసరని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల మీటింగ్‌లు, బ్యానర్లు ఇతర సామగ్రిని వీడియో సర్వైలెన్స్ టీం రికార్డు చేయాలని కోరారు. ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, సంజీవరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన విద్య


ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్



బాత్రూంలను పరిశీలిస్తున్న పీఓ ప్రతీక్ తదితరులు

చర్ల/చర్లరూరల్/దుమ్ముగూడెం : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం పుష్టికరమైన ఆహారం, నాణ్యమైన చదువు అందిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ పేర్కొన్నారు. ఆదివారం చర్ల మండలం ఉంజుపల్లి బాలుర ఆశ్రమ పాఠశాల, చర్ల గిరిజన బాలికల వసతి గృహం, సత్యనారాయణపురం గిరిజన బాలుర వసతి గృహం, దుమ్ముగూడెం మండలంలో రామచంద్రుని పేట గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాల, హాస్టల్ భవనాలు, తరగతి గదుల్లో ఫ్యాన్లు, లైట్లను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. వేసవి సెలవులు కావడంతో రామచంద్రుని పేట ఆశ్రమ పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్లు, బాత్రూంలు, డైనింగ్ హాలు, డార్మెటరీ హాల్‌ను శుభ్రం చేయకుండా ఉంచడంతో ఏటీడీఓ, హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పీఓ మాట్లాడుతూ ఇంటిని మరిపించేలా అన్ని రకాల వసతి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాఠశాలలు తిరిగి జూన్ 12న ప్రారంభమవుతాయని, అంతకు వారం రోజుల ముందే మరమ్మతులు పూర్తి చేయించాలని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పించాలని ఐటీడీఏ అధికారులను ఆదేశించారు. పాఠశాల భవనాలకు వైట్‌వాష్ చేయించాలన్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు స్థానికంగా ఉండి మరమ్మతు పనులు నాణ్యంగా చేపట్టేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓ, స్పెషల్ ఆఫీసర్ నర్సింగ్ రావు, పాఠశాల హెచ్‌ఎంలు వీరమ్మ, సాయన్న, వార్డెన్‌లు ఈశ్వర్‌రావు, రాధమ్మ, వాల్‌సింహ ఉన్నారు.

హోరాహోరీగా జెన్‌కో క్రీడా పోటీలు




కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాల్వంచ: కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి, సెంట్రల్ ఆఫీస్ ప్రాంగణంలో జరుగుతున్న జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ అథ్లెటిక్స్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఆదివారం రెండోరోజు కబడ్డీ మొదటి మ్యాచ్‌లో కేటీపీఎస్ 5,6 దశల జట్టు వైటీపీఎస్‌పై 27 పాయింట్ల తేడాతో విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో భూపాలపల్లి జట్టుపై కేటీపీఎస్ 7వ దశ జట్టు 26 పాయింట్ల తేడాతో గెలుపొందింది. డిస్కస్ త్రోలో టి.సతీశ్ మొదటి స్థానం, అమీర్ ఖాన్ రెండో స్థానం, కె.వెంకటేశ్వర్లు మూడో స్థానంలో, షార్ట్‌పుట్‌లో డి.సతీశ్ ప్రథమ, శేషు, ద్వితీయ, బి.రమేశ్ తృతీయ స్థానంలో నిలిచారు. జావెలిన్ త్రోలో భాను ప్రథమ, మోహన్ ద్వితీయ, కచ్చా రమేశ్ తృతీయ, 800 మీటర్ల రన్నింగ్ విభాగంలో సతీశ్ ప్రథమ, ప్రవీణ్ ద్వితీయ స్థానం, 1500 మీటర్లలో సతీశ్ ప్రథమ, ప్రవీణ్ ద్వితీయ స్థానాలు సాధించారు. క్రీడా పోటీలను జెన్‌కో డిప్యూటీ సెక్రటరీ ఎస్.లోహిత్ ఆనంద్, కేటీపీఎస్ 5,6 దశల క్రీడా సెక్రటరీ తంబళ్ల వీరస్వామి పర్యవేక్షించారు. రిఫరీలుగా లక్ష్మణ్, కృష్ణ, వీరూనాయక్ వ్యవహరించారు.

ఏడో గ్యారంటీ ఇస్తా

- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉంటా
- కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి

దమ్మపేట/అశ్వారావుపేట: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు అదనంగా ఏడో గ్యారంటీగా ఉమ్మడి జిల్లా సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉంటానని కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం రఘురాంరెడ్డి గెలుపును కాంక్షిస్తూఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధ్యక్షతన దమ్మపేట బాలాజీ సెంటర్‌లో, అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ సెంటర్‌లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు వేలాదిగా కాంగ్రెస్ శ్రేణులతో పాటు మద్దతుగా సీపీఐ, సీపీఎం, టీడీపీ శ్రేణులు కూడా హాజరయ్యాయి. ఈ సందర్భంగా ఖమ్మం పార్లమెంటు అభ్యర్థి రఘురాం రెడ్డి మాట్లాడుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారెను సూపర్ స్టార్‌గా అభివర్ణించారు. అధికారంలోకి వచ్చిన 150 రోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో, ఐదు గ్యారంటీలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ అసమర్థ పాలనతోనే నీళ్లు, నిధుల్లేని పరిస్థితి వచ్చింది..
పదేళ్లపాటు కొనసాగిన బీఆర్‌ఎస్ అసమర్థ పాలన కారణంగా నేడు నీళ్లు, నిధులు లేని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, ధరణి, రైతు రుణమాఫీ, ప్రభుత్వ ఉద్యోగుల ఎంపికకు నిర్వహించే పరీక్షలు, డబుల్ బెడ్రూమ్ తదితర విషయాల్లో బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15న రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ జరుగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ పాలనలో పెట్రోలు, గ్యాస్ ధరలు పెరగగా, పరిశ్రమలు ప్రైవేటీకరించారని ఆరోపించారు. 2 కోట్ల ఉద్యోగాల హామీని నెరవేర్చలేదని విమర్శించారు. అంతకుముందుగా అశ్వారావుపేట, ఇల్లెందు ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, కోరం కనకయ్య, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మువ్వా విజయబాబు, బాలసాని లక్ష్మీనారాయణ, స్వర్ణకుమారి మాట్లాడుతూ ఈ కార్నర్ మీటింగ్‌కు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు హాజరు కావాల్సి ఉన్నప్పటికీ, అత్యవసర పనిమీద సీఎం రేవంత్ రెడ్డిని కలిసే నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రఘురాంరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, కోటగిరి సత్యంబాబు, రావు గంగాధరరావు, సుంకవల్లి వీరభద్రరావు, చిన్నశెట్టి యుగంధర్, సత్యప్రసాద్, పర్వతనేని ప్రసాద్, సాయిల నర్సీ, రావు రవిశంకర్, రాధకృష్ణ, పగడాల రాంబాబు, చిట్టిబాబు, సీపీఐ నాయకులు సలీం, సీపీఎం నాయకులు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి తెలంగాణ ఎలక్షన్ 2024

నిత్యం అందుబాటులో ఉంటా




మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా

పాల్వంచ: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని, తనను గెలిపించే బాధ్యత నాయకులు తీసుకోవాలని బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం గట్టాయిగూడెంలోని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిలారు నాగేశ్వరరావు ఇంట్లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అందాల్సిన పథకాలను నీరుగారుస్తోందని విమర్శించారు. కేసీఆర్ చేసిన అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓట్లు అడగాలన్నారు. కొత్తగూడెంలో కేసీఆర్ కార్నర్ మీట్‌ను విజయవంతం చేయాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ తెచ్చిన ఘనుడు కేసీఆర్ అని, ఈ ప్రాంత అభివృద్ధి అణువణువునా కనిపిస్తోందని అన్నారు. సమావేశంలో నాయకులు మంతపురి రాజుగౌడ్, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కాంపెల్లి కనకేశ్, కనగాల బాలకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, ఉంద్రాతి రవి, రవిచంద్ర, రమణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తగూడేనికి జేపీ నడ్డా



జేపీ నడ్డా

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నడ్డా సోమవారం కొత్తగూడెం రానున్నారు. ప్రకాశం స్టేడియంలో జరిగే ఖమ్మం పార్లమెంటరీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తారు. ఉదయం 10:50 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 11.20 గంటలకు కొత్తగూడెం హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 11.35 గంటలకు ప్రకాశం స్టేడియంలో జరిగే బహిరంగ సభకు హాజరవుతారు. 11:40 నుంచి 12:30 వరకు సభలో ప్రసంగిస్తారు. తిరిగి 12.50 గంటలకు హెలికాప్టర్‌లో మహబూబాబాద్ వెళతారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు తదితరులు ఉంటారు.

క్లుప్తంగా

టీబీజీకేఎస్ కార్యాలయం స్వాధీనం



తాళం పగులగొడుతున్న సిబ్బంది

ఇల్లెందు: పట్టణంలోని జేకే ఏరియాలో ఉన్న టీబీజీకేఎస్ కార్యాలయం తాళాలు పగులగొట్టి ఆదివారం సింగరేణి ఎస్అండ్ పీసీ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయం అప్పగించాలని సింగరేణి అధికారులు పలు దఫాలు కోరినా టీబీజీకేఎస్ నేతలు అప్పగించలేదు. దీంతో అధికారుల సూచన మేరకు ఎస్అండ్‌పీసీ గార్డులు కార్యాలయాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే కార్యాలయాన్ని ఐఎన్‌టీయూసీకి కేటాయించనున్నారని, నేడో రేపో ప్రారంభిస్తారని సమాచారం.

రేషన్ బియ్యం సీజ్

మణుగూరు టౌన్: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మణుగూరు 100 పడకల ఆస్పత్రి వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున ట్రాలీలో 40 క్వింటాళ్ల తరలిస్తుండగా పట్టుకుని సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు. నిందితుడు గుట్ట మల్లారానికి చెందిన చక్రపాణిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సతీష్‌కుమార్ తెలిపారు.

విలేకరిపై కేసు నమోదు

బూర్గంపాడు: గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానులను బెదిరించి, డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన యూ ట్యూబ్ చానల్ విలేకరిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ట్రాక్టర్ యజమానుల ఫిర్యాదు మేరకు సారపాకకు చెందిన యూట్యూబ్ చానల్ విలేకరి లక్ష్మణరావుపై 384 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు బూర్గంపాడు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులు ఇద్దరు యువకుల నుంచి 10.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా ఏపీలోని నెల్లూరుకు సాంబయ్యపాలెం శ్యామ్, యాకసిరి జగదీష్‌లు సీలేరు నుంచి గంజాయి తీసుకెళ్తున్నట్లు తేలింది. నిందితుల నుంచి బైక్, సెల్‌ఫోన్, రూ.2,62,500 విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ విజయలక్ష్మి తెలిపారు.

రూ.1.06 లక్షల నగదు సీజ్

అశ్వాపురం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీల్లో ఆదివారం రూ.1.06 లక్షల నగదు సీజ్ చేశారు. మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామం వద్ద మణుగూరు–కొత్తగూడెం ప్రధాన రహదారిపై సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. మండల కేంద్రానికి చెందిన వ్యక్తి సరైన పత్రాలు లేకుండా వాహనంలో రూ.1.06 లక్షల నగదు తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు.


ఉరివేసుకుని కార్మికుడి ఆత్మహత్య

బూర్గంపాడు: సారపాకలోని గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన అంగోత్ శ్రీను(33) ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు చేసుకున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులు అతనికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే శ్రీనుకు ఓ యువతితో ఐదేళ్లుగా స్నేహం ఉందని, ఆమెతో తరచు ఫోన్‌లో మాట్లాడుతుంటాడని తెలుస్తోంది. పెళ్లి సంబంధాలు చూస్తున్న నేపథ్యంలోనే అతను ఆత్మహత్యకు పాల్పడటం ఆ కుటుంబాన్ని తీవ్రంగా కలిచివేసింది. మృతుడి తల్లి దేవి ఫిర్యాదు మేరకు ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ బావిలో పడి రైతు మృతి

చింతకాని : మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో తుమ్మలపల్లి వెంకటరావు (40) అనే రైతు ఆదివారం ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటరావు సుబాబుల్ చెట్లకు నీళ్లు పెట్టేందుకు ఉదయం తోటకు వెళ్లాడు. మోటారు ఆన్‌చేసే క్రమంలో ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. మధ్యాహ్నం వరకు ఇంటికి రాకపోవడంతో ఆయన భార్య పద్మ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో చుట్టుపక్కల వారితో కలిసి తోటకు వెళ్లి చూడగా బావి వద్ద చెప్పులు కనిపించాయి. గ్రామస్తుల సహాయంతో బావిలో గాలించగా మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న ఎస్సై నాగుల్‌మీరా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెంకటరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర రూ.14,174

ఆర్టీసీలో 'మహాలక్ష్మి' కళ!

ఉచిత ప్రయాణానికి అపూర్వ స్పందన

- రీజియన్‌లో ఇప్పటివరకు 1.40 కోట్ల మంది మహిళల రాకపోకలు
- ఆర్టీసీకి రూ.72.18 కోట్ల మేర ఆదాయం
- జీరో టికెట్ వరమంటున్న మహిళామణులు

ఆర్టీసీలో అమలవుతున్న మహాలక్ష్మి పథకానికి అపూర్వ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది డిసెంబర్ 9న మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. తొలి వారం పాటు మహిళలకు ఎలాంటి ఆధారం చూపించకుండానే ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. ఆ తర్వాత డిసెంబర్ 14 నుంచి ఆర్టీసీలో జీరో టికెట్ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చి ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించాలనే నిబంధన ప్రవేశపెట్టారు. కాగా, ఈ విధానం అమల్లోకి వచ్చాక ఆర్టీసీలో 54 శాతానికి పైగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని వినియోగించుకుంటుండగా.. గతంలో 69 శాతంగా ఉన్న ఓఆర్.. ఇప్పుడు ఏకంగా 90 – 100 శాతానికి పెరిగింది. ఉచితంగా ప్రయాణించే మహిళా ప్రయాణికుల చార్జీ మొత్తాన్ని ఆర్టీసీకి ప్రభుత్వమే చెల్లిస్తుండగా.. తమకు ఆర్థికంగా వెసులుబాటు కలిగిందని అతివలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– చుంచుపల్లి



ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికులు

ఖమ్మం రీజియన్‌లో ప్రయాణించిన మహిళలు

డిపో	ప్రయాణికులు	ఆదాయం (రూ.లక్షల్లో)
భద్రాచలం	14,01,734	934.15
ఖమ్మం	35,19,207	1,741.22
కొత్తగూడెం	19,95,745	1,048.22
మధిర	12,82,001	911.88
మణుగూరు	19,47,087	1,071.00
సత్తుపల్లి	34,23,831	1,269.64
ఇల్లెందు	5,26,150	242.68

1.40 కోట్ల మంది ఉచిత ప్రయాణం

మహాలక్ష్మి పథకానికి ముందు.. తర్వాత అన్నట్లు ఆర్టీసీలో రికార్డులు నమోదవుతున్నాయి. గతంలో ఆర్టీసీ బస్టాండ్లలో డ్రైవర్లు, కండక్టర్లు పోటీ పడి బస్సుల్లో ప్రయాణికులను ఎక్కించుకునేవారు. బస్సు నిండే వరకు వేచి ఉండేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. బస్సు ప్లాట్‌ఫాం మీదకు రావడమే ఆలస్యం.. జనం కిక్కిరిసిపోతున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు ఏడు ఆర్టీసీ డిపోలు ఉండగా.. మహాలక్ష్మి పథకం అమలవుతున్న ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు 383 ఉన్నాయి. ఇందులో ఆర్టీసీకి చెందిన పల్లె వెలుగులు 74, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 63 ఉండగా, ఇక అద్దె బస్సులకు సంబంధించిన పల్లె వెలుగు సర్వీసులు 124, ఎక్స్‌ప్రెస్‌లు 122 నడుస్తున్నాయి. ఈ సర్వీసులు రోజువారీ 1.55 కిలోమీటర్ల మేర తిరుగుతుంటాయి. కాగా, రీజియన్ పరిధిలో గత డిసెంబర్ 14 నుంచి ఇప్పటివరకు 1,40,95,755 మంది మహిళలు ఉచితం ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారు. వీరి టికెట్ల మొత్తాన్ని ప్రభుత్వం ఆర్టీసీకి చెల్లించనుండడంతో సంస్థకు రూ. 72.18 కోట్ల ఆదాయం సమకూరినట్లయింది. కాగా, ఖమ్మం డిపోలో అత్యధికంగా 35,19,207 మహిళా ప్రయాణికులు ఆర్టీసీలో ప్రయాణించగా, అత్యల్పంగా ఇల్లందులో 5,26,150 మంది మహిళలు ప్రయాణించారు. అయితే, ఈ పథకం అందుబాటులో ఉన్న పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లు మరిన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు సెలవు రోజుల్లో సర్వీసుల సంఖ్య పెంచితే అటు మహిళలు.. ఇటు ఇతర ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఆధార్ కార్డులను వెంట తీసుకొని బస్సెక్కిన మహిళలు

మహిళలకు వరం



మహాలక్ష్మి పథకం మహిళలకు వరంగా మారింది. ఈ పథకం ద్వారా తెలంగాణ పరిధిలో ఎక్కడి నుంచి ఎక్కడైనా ఉచితంగా ప్రయాణించడాన్ని మంచి అవకాశంగా భావిస్తున్నాం. ఆర్టీసీలో ఇలాంటి పథకాన్ని ప్రవేశపెట్టడం గొప్ప విషయం.

– రాజేశ్వరి

ఆర్థిక భారం తప్పింది



ఈ పథకంతో మహిళలపై భారం తగ్గింది. కొత్తగూడెం నుంచి ఇల్లెందుకు రూ.70 చార్జి ఉండేది. ఇప్పుడు ఉచితంగానే వెళ్లి వస్తున్నాం. మహిళలు ఊహించని విధంగా ఉచిత ప్రయాణాన్ని ప్రారంభించడం అభినందనీయం.

– టి.లక్ష్మి

రికార్డుస్థాయి ప్రయాణాలు



మహాలక్ష్మి పథకానికి అనూహ్య స్పందన వస్తోంది. గడిచిన నాలుగు నెలల్లో ఏకంగా 1.40 కోట్ల మంది మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. రీజియన్ పరిధిలో జీరో టికెట్ల ద్వారా రూ.72.18 కోట్ల ఆదాయం సమకూరింది.

– సీహెచ్.వెంకన్న, ఆర్‌ఎం

కేసీఆర్ రోడ్ షోకు తరలిరావాలి

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు

జూలూరుపాడు/టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 30న ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించే రోడ్ షోను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు కోరారు. ఆదివారం జూలూరుపాడులో బీఆర్‌ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో, టేకులపల్లిలో హరిప్రియ ఫౌండేషన్ ఆస్పత్రి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అబద్ధాలు, మోసపూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలు, గ్యారంటీ పథకాలు అమలయ్యే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ఫ్రీ బస్సు వల్ల రోజూ బస్సులో మహిళలు జుట్లు పట్టుకుని కొట్టుకుంటున్న సంఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థులు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత గెలుపే ధ్యేయంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ మాట్లాడుతూ ఐదు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ, బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్‌జేసీ కృష్ణ, నాయకులు దిండిగల రాజేందర్, లక్కినేని సురేందర్, యల్లంకి సత్యనారాయణ, లకావత్ గిరిబాబు, పీజీ క్రిష్ణమూర్తి, ఎదళ్లపల్లి వీరభద్రం, మూడ్ చిట్టిబాబు, చావా వెంకటరామారావు, కొడెం సీతాకుమారి, బాదావత్ బాలాజీ, టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర వర ప్రసాద్‌గౌడ్, నాయకులు బోడ బాలు నాయక్, లక్కినేని శ్యాం, చీమల సత్యనారాయణ, లాలు, రామ, కిషన్, కిరణ్, రామకృష్ణ, ఉపేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేగా కాంతారావు

విజయవంతం చేయాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 30న కొత్తగూడెంలో నిర్వహించే కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని ప్రోగ్రామ్ ఇన్చార్జ్ ఉప్పల వెంకటరమణ కోరారు. జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాయంత్రం 5 గంటలకు పోస్టాఫీస్ సెంటర్‌లో రోడ్ షో ప్రారంభమవుతుందని, రైల్వేస్టేషన్ సెంటర్‌లో మీటింగ్ ఉంటుందని తెలిపారు. మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్య సోన, బీఆర్‌ఎస్ నాయకులు మోరె భాస్కర్, అనుదీప్, నవతన్, తొగరు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు మండలంలోని విజయనగరం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన బిజ్జ రమేష్(40) తన సోదరుడు కృష్ణ(38)తో కలిసి ద్విచక్ర వాహనంపై కరకగూడెం మండలంలోని రేగళ్ల గ్రామంలో బంధువుల ఇంటి నుంచి తన కుమార్తెను తీసుకొచ్చేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కలవలనాగరం మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణకు తీవ్ర గాయాలుకాగా భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజేందర్ ప్రమాద స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వితంతువుపై లైంగిక దాడికి యత్నం

టేకులపల్లి: వితంతువుపై ఓ వ్యక్తి అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా ఆదివారం వెలుగుచూసింది. మండలంలోని మారుమూల ఏజెన్సీ గ్రామానికి చెందిన, 45 ఏళ్ల వితంతు మహిళ తన కుమార్తెతో కలిసి ఉంటోంది. ఈ నెల 23న రాత్రి అదే గ్రామానికి చెందిన 56 ఏళ్ల వ్యక్తి ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె ప్రతిఘటించి కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి దేహశుద్ధి చేయడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై శనివారం గ్రామంలో విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయమై బోడు ఎస్‌ఐ పొడిశెట్టి శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

8 నెలల క్రితం వృద్ధురాలిపై లైంగిక దాడి

అదే గ్రామంలో 8 నెలల క్రితం 80 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి జరిగింది. ఆమె భర్త మృతి చెందడంతో వృద్ధురాలు ఒక్కతే ఇంట్లో ఉంటోంది. ఇది గమనించిన కామాంధుడు రాత్రి వేళ ఇంట్లోకి జొరబడి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత డబ్బుల కోసం ఇంట్లో సామాన్లను చిందర వందరగా పడేశాడు. మరుసటి రోజు స్థానికుల ద్వారా కుటుంబ సభ్యులు విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి కామాంధుడి కోసం గాలిస్తున్నారు. కాగా వితంతువుపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తే వృద్ధరాలిపై అఘాయిత్యం చేసి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కాపర్ వైర్ చోరీ

కరకగూడెం: పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్ చోరీచేశారు. రైతుల సమాచారంతో విద్యుత్ శాఖ ఏఈ కావ్య సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చోరీ చేసిన కాపర్ వైరు విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు. అనంతరం రైతులతో కలిసి ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు.



కాపర్ కోసం ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుడు...



వినోద్ (ఫైల్)

ఇల్లెందురూరల్: భూపాలపల్లి ఏరియా సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు కాంపాటి వినోద్ (30) ఆదివారం మండలంలోని కొమరారం గ్రామంలో గుండెపోటుతో మృతిచెందాడు. రెండు రోజుల క్రితం కొమరారం గ్రామానికి వచ్చిన ఆయన కుటుంబ సభ్యులు, బంధువులతో సరదాగా గడిపాడు. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వినోద్ మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతున్న యువకుడు...



బిలాల్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని 21పిట్ ఏరియాకు చెందిన బిలాల్ (30) చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. టెంట్‌హౌస్ నిర్వాహకుడైన బిలాల్ మూడు రోజుల క్రితం కొమ్ముగూడెం గ్రామంలో టెంట్లు వేసి తిరిగి వస్తుండగా రొంపేడు చెక్‌పోస్టు వద్ద బైక్ అదుపుతప్పడంతో కింద పడగా, తీవ్రగాయలయ్యాయి. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతిపట్ల మాజీ సర్పంచ్‌లు పూనెం కవిత, ధనసరి స్రవంతి, ఎంపీటీసీ పూనెం సురేందర్, సూర్నపాక సత్యనారాయణ, వడ్ల శ్రీను, మంచాల వెంకటేశ్వర్లు, ఎట్టి హరికృష్ణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్న ఓ మెకానిక్ షెడ్‌లో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.2,830 నగదు, 4 సెల్‌ఫోన్లు, 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఆన్‌లైన్ విధానంలో మాక్ ఈఏపీసెట్ రాస్తున్న విద్యార్థులు



'మాక్ ఈఏపీ' సక్సెస్

- సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ ఆధ్వర్యంలో నిర్వహణ
- కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష
- జిల్లావ్యాప్తంగా అధిక సంఖ్యలో హాజరైన విద్యార్థులు
- మాక్ ఈఏపీ ఆత్మస్థైర్యం నింపిందని హర్షం

పాల్వంచ: ఈఏపీ సెట్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులను పరీక్షకు సిద్ధం చేసేందుకు సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ ఆధ్వర్యంలో ఆదివారం మాక్ ఈఏపీ సెట్ నిర్వహించారు. పట్టణంలోని కేఎల్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించగా, పాల్వంచ కేఎల్ఆర్ జూనియర్ కళాశాల, కొత్తగూడెం కృష్ణవేణి, శ్రీ నలంద, మణుగూరు శ్రీ విద్యా కృష్ణవేణి జూనియర్ కళాశాలతోపాటు పలు ఇతర కళాశాలల విద్యార్థులు కూడా హాజరయ్యారు. విద్యార్థులు అధిక సంఖ్యలో రావడంతో ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. నిపుణులైన అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ప్రశ్నాపత్రాలు రూపొందించగా, మాక్ ఈఏపీ సెట్ తమ సామర్థ్యాన్ని అంచనా వేసుకునేందుకు దోహదం చేసిందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. 'భవిత'ద్వారా పోటీ పరీక్షల మెటీరియల్ అందిస్తూ విద్యార్థుల విజయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని, ఏటా మాక్ టెస్టులు నిర్వహిస్తూ ఆత్మస్థైర్యం నింపుతున్నారని పేర్కొన్నారు. కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్‌పర్సన్ కె.నాగమణి, డైరెక్టర్ కాశీ విశ్వనాథం, మురళీప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, అడ్మిషన్ సెల్ ఇన్‌చార్జి హాతీరాం, ఏఓ నాగేశ్వరరావు, సాక్షి ఈవెంట్స్ మేనేజర్ బి.వేణు, పాల్వంచ విలేకరి ఆర్.సంజీవ్ కుమార్, ఇతర హెచ్ఓడీలు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యం నింపేలా..



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మాక్ ఈఏపీ సెట్ విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా ఉంది. ఈఏపీ సెట్ పరీక్షా విధానం, పేపర్‌లోని ప్రధానాంశాలు, సమయపాలన వంటి అంశాలు తెలుసుకునే వెసులుబాటు కలిగింది. ఇలాంటి పరీక్షలు వారి కెరీర్‌కు దోహదం చేస్తాయి.

–కె.నాగమణి, కేఎల్ఆర్ విద్యాసంస్థల చైర్ పర్సన్

పరీక్షా సరళి తెలిసింది



సాక్షి పత్రికలో వచ్చే విద్యారంగ పేజీలు మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. మాక్ ఈఏపీ సెట్ ద్వారా పరీక్ష అంటే భయం లేకుండా పోయింది. మాదిరి ప్రశ్నలు, పరీక్షా సరళిని తెలుసుకోగలిగాం. మంచి ర్యాంక్ సాధిస్తామని నమ్మకం కలిగింది.

–భవాని, కేఎల్ఆర్ జూనియర్ కళాశాల, పాల్వంచ

అవగాహన కలిగింది



ఇటువంటి పరీక్షలు రాయడం వల్ల భవిష్యత్‌లో ఎదురయ్యే పోటీని తట్టుకోగలమనే నమ్మకం కలిగింది. ప్రతీ సబ్జెక్ట్‌లో ఏవిధమైన తర్ఫీదు అవసరమో తెలిసింది. చదువుకున్న అంశాలను పరీక్షలో ఏ విధంగా ప్రజెంట్ చేయాలో మాక్ టెస్ట్ ద్వారా అర్థమైంది.

–వి.కోకిల, విద్యా కృష్ణవేణి కళాశాల, మణుగూరు

పరీక్షా విధానం అర్థమైంది



పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు మాక్ టెస్టులు ఉపయోగపడతాయి. ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్షలు రాయడంతో ఇక ఈఏపీ సెట్ భయం లేకుండా రాయగలుగుతాం. సాక్షి యాజమాన్యం మాక్‌టెస్ట్ నిర్వహించినందుకు ధన్యవాదాలు.

–వి.తనూజ, నలందా కళాశాల, కొత్తగూడెం

మానసిక ఒత్తిడి దూరం..



పరీక్షలకు ముందు ఇలాంటి పరీక్ష రాయడం వల్ల విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గుతుంది. ఆన్‌లైన్ పరీక్ష రాసేందుకు మంచి అవగాహన వస్తుంది. పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ ప్రశ్నలకు ఎంత సమయం వెచ్చించాలో తెలుసుకున్నాను.

–ఎస్‌డి.ముజాకీర్, కృష్ణవేణి కళాశాల, కొత్తగూడెం



పరీక్ష కేంద్రానికి తరలివస్తున్న విద్యార్థులు